# విశ్వవ్యాపిత అంటువ్యాధి కోవిడ్ 19 - పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం

**ప్రపంచవ్యాప్తంగా** తీవ్రంగా విస్తరిస్తున్న కోవిడ్-19 ప్రజారోగ్యం, ప్రపంచశాంతి, అభివృద్ధిలకు తక్షణ పెనుసవాళ్ళు విసురుతోంది. సిపిఐ(ఎం-ఎల్) ప్రజలందరికీ ముఖ్యంగా ప్రజారోగ్యపరిరక్షణకు, ప్రజల జీవితాలను కాపాడడానికి తమను తాము అంకితం చేసుకుంటున్న ఆరోగ్య సిబ్బందికి అభివందనాలు తెలియజేస్తోంది. కోవిడ్-19 వ్యాధితో బాధపడుతున్న వారికీ, అలాగే వ్యాధివలన నష్టపోయిన వారి కుటుంబాలకు మా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాము. ఈ మహమ్మారి బారినపడి ప్రాణాలను కోల్పోయిన వారిపట్ల ప్రగాఢ విచారాన్ని వ్యక్తం చేస్తున్నాము.

ఈ కోవిడ్-19 బారినుంచి బయటపడటానికి చేసే ప్రయత్నాలు ప్రభావవంతంగాను, నిజాయితీగాను లేకపోతే ప్రజల ఆరోగ్యాలకు, ప్రాణాలకు తీవ్రమైన హానిజరగటమేకాక అనేక దేశాల ఆర్థిక సామాజిక అభివృద్ధికి తీవ్రవిఘాతం కలుగుతుంది. అన్నిటికన్నా ప్రజల ఆరోగ్యాలకు, ప్రాణాలకు ప్రాధాన్యతనిచ్చి కోవిడ్-19 విస్తరించకుండా అవసరమైన దృఢమైన చర్యలను చేపట్టవలసిందిగా భారత ప్రభుత్వానికి సిపిఐ(ఎం-ఎల్)విజ్ఞప్తిచేస్తోంది. వైద్యులు, శాస్త్రవేత్తలు సూచించిన నివారణ, ఉపశమన పద్ధతులను, సామాజిక బాధ్యతా స్పృహతో పాటించాలని ప్రజలందరికీ మేము పిలుపునిస్తున్నాము.

ఏ దేశానికైనా, ప్రాంతానికైనా, ప్రజాసమూహానికైనా వ్యతిరేకంగా వస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు, చర్యలను సిపిఐ(ఎం-ఎల్) దృఢంగా వ్యతిరేకిస్తోంది. భారతదేశంలో కోవిడ్-19 వ్యాపించటానికి ఒక దేశము, ఒక మతము కారణమని చూపించడానికి జరుగుతున్న హేయమైన కుట్రలకు బలికావద్దని ప్రజలకు పిలుపునిస్తున్నాము. భారతదేశం ఆతిధ్యం ఇస్తున్న విదేశీ ప్రజల, విద్యార్థుల ఆరోగ్యము, భద్రత, న్యాయమైన కోర్కెలను పరిరక్షించడానికి అవసరమైన క్రియాశీల కార్యాచరణను ప్రభుత్వం చేపట్టవలసిందిగా సిపిఐ(ఎం-ఎల్) పిలుపునిస్తోంది.

పెట్టుబడిదారీ వినాశకర అహేతుకతను కోవిడ్-19 విస్తరణ బట్టబయలుచేస్తోంది. అది సహజ వనరులను నాశనం చేయటమే కాక, పర్యావరణాన్ని కలుషితంచేసి, భూమిమీద జీవుల మనుగడ దుర్భరమయ్యే పరిస్థితులను సృష్టిస్తోంది. ఈవిధంగా సూక్ష్మజీవులలో ఉత్పరివర్తనాలకు కారణమవుతుంది. ఇటీవలి కాలంలో కరోనా వైరస్ భిన్నరూపాలుగా వ్యక్తమైన సార్స్, మెర్స్ మొదలైన హానికారక వైరస్‌ల బారినపడి మానవాళి ఎంతో నష్టపోవాల్సి వచ్చింది. శాస్త్ర పరిశోధకులకు వందల రకాల కరోనా వైరస్‌ల ఉనికి దాదాపు రెండు దశాబ్దాలుగా తెలుసు. ఆ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్వహణ కోవిడ్-19 పుట్టుకకు దారితీయటమేకాక, ఈ మహమ్మారి నివారణకు అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని హేతుబద్ధంగా వినియోగించుకోవడంలో కూడా విఫలమైంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ, చైనా సంయుక్తంగా చేపట్టిన అధ్యయనాలు, వాటి రిపోర్టులు ఈ సంవత్సరం ఫిబ్రవరి నెల చివరి వారానికల్లా అందుబాటులోకి వచ్చాయి. అన్ని దేశాలు అనుసరించాల్సిన సూచనలు అందులో పొందుపరచబడ్డాయి. ఇప్పటివరకూ భారత ప్రభుత్వం దానికి స్పందించలేదు. ఈ కీలకమైన నెలరోజుల ఆలస్యం కోవిడ్-19 భారత దేశమంతటా విస్తరించటానికి కారణమైంది.

ఇటువంటి అంటువ్యాధులు సంభవించినప్పుడు విస్తృతంగా ఆచరణలో వున్న పద్ధతులు ఏమిటంటే వైరస్ సంక్రమించి వుంటుందని అనుమానమున్న అందరికీ తప్పనిసరిగా పరీక్షలు చేయడం, వ్యాధి ధృవీకరించబడ్డ వారిని వేరుచేసి చికిత్స అందించడం. దీనికి విరుద్ధంగా, ప్రభుత్వం, ముందు లాక్-డౌన్, తర్వాత కొంతమందికి మాత్రమే పరీక్షలను చేస్తుంది. కోవిడ్-19 అంతటి మహమ్మారిని ఎదుర్కొనడానికి ఇది ప్రభావవంతమైన విధానం కాదు. లాక్-డౌన్ చర్య మహమ్మారిని ఎదుర్కొనడానికి సన్నద్ధం కావడానికి సమయాన్ని మాత్రమే యిస్తుంది. అదే సందర్భంలో ఈ లాక్-డౌన్, వైరస్ వ్యాప్తికి కారకులుగా ప్రజలను నిందించడానికి కూడా ఉపయోగపడుతుంది.

ప్రభుత్వం ఈ లాక్-డౌన్ చర్యను ప్రణాళికాబద్ధమైన వ్యూహం లేకుండానే విధించింది. దీనితో ప్రజారోగ్యంతో సహా, కోవిడ్-19ను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలు శ్రమజీవులకు కొత్తకష్టాలను సృష్టిస్తున్నాయి. వారు తమ పనులను, జీతాలను కోల్పోయి నిలువనీడ లేకుండా పోతున్నారు.

లక్షలాదిమంది వలసకార్మికులు, వారి కుటుంబాలు, జీవనోపాధి నుండి వేరుచేయబడి, చెప్పలేని కష్టాలను భరించాల్సి వస్తుంది. ఉపాధి వేటలో మహానగరాలకు నెట్టివేయబడిన వీరు అతి దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. నిరంతర శ్రామికులైన వీరులేనిదే రోజుగడవని నగరాలకు ఇప్పుడు వీళ్ళు అకస్మాత్తుగా అవాంఛనీయులైపోయారు. ఈ కార్మికులు, కుటుంబాలతో పాటు తమ సుదూర గ్రామాలకు కాలినడకన బయలుదేరవలసి వచ్చింది. ప్రతిజిల్లా, రాష్ట్ర సరిహద్దు వద్ద వారు బారికేడ్లను ఎదుర్కోవలసి వచ్చింది. ఆహారం, ఆశ్రయం లేకుండా అక్కడే రోజుల తరబడి నిలిపివేయబడ్డారు. ఈ భరించలేని పరిస్థితుల మధ్య వాళ్ళు ముందుకు సాగుతూ, విఫలమైన పాలకులు తరచూ ఆశ్రయించే క్రూరమైన అణచివేతను ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వానికి, వీరికి సహాయం అందించే ప్రణాళిక లేనే లేదు. ఇక ప్రధాని, ఆర్థికమంత్రి ఇచ్చిన వాగ్దానాల మాట సరేసరి. లాక్‌డౌన్ ప్రకటించి రెండువారాలు అయినప్పటికీ, ప్రభుత్వం వారికి ఆర్థిక మరియు ఇతర సహాయం అందించడానికి ఇంకా ఏర్పాట్లు చేయలేదు. అధికార పీఠాలు నిరంతరం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ గురించి మాట్లాడుతున్నారు. వాస్తవం ఏమిటంటే, జనధన్ ఖాతాలలో సగానికిపైగా పనిచేయనివే. శ్రామికప్రజల రక్షణ బాధ్యతను వాళ్ళకే వదిలేసి, చప్పట్లు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం చూపించాలని ప్రధాని మోడీ పిలుపునివ్వడం కేవలం ప్రచారపు ఆర్భాటం తప్ప మరేమీ కాదు.

నయా ఉదారవాద విధానాల పేరుతో ముందుకు తెస్తున్న పెట్టుబడిదారీ ఆదేశాలలో భాగంగా తీసుకున్న ప్రజారోగ్యం, వైద్యసేవల ప్రైవేటీకరణ వైఫల్యాన్ని కూడా ఈ మహమ్మారి తెరపైకి తెచ్చింది. ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ ఆస్పత్రులు కోవిడ్ రోగులకు వైద్యసేవలు అందించడానికని, ఇతర రోగులకు అన్ని వైద్యసేవలను నిలిపివేయాల్సి వచ్చింది. ఇప్పటికే అధిక వత్తిడిలో పనిచేస్తున్న ఈ ఆసుపత్రులు, ప్రజావ్యవస్థలు కోవిడ్-19 కేసులు పెరిగితే పూర్తిగా కుప్పకూలిపోయేటంత బలహీనంగా వున్నాయి. సరైన అర్థంలో సామాజిక బాధ్యతతో, శాస్త్రవేత్తలు సూచించిన నివారణ, ఉపశమన చర్యలకు కట్టుబడి వుండాలని సిపిఐ(ఎం-ఎల్) మరోసారి ప్రజలకు పిలుపునిస్తోంది.

విజయవాడ **విశ్వం, ప్రధాన కార్యదర్శి**

5, ఏప్రిల్, 2020 **సిపిఐ(ఎం-ఎల్)**

౦౦౮